క్లుప్తంగా

ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ఆటల పోటీలు



రేపల్లె రూరల్: ఈ నెల 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని పట్టణంలోని భవిత స్కూల్‌లో ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు సోమవారం ఆటల పోటీలు నిర్వహించారు. చిన్నారులు పోటాపోటీగా ఆటల పోటీల్లో పాల్గొన్నారు. చిన్నారులకు మ్యూజికల్ చైర్స్, చిత్రలేఖనం, స్కిప్పింగ్ తదితర ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేటర్‌లు ఎస్.అనురాధ, వి.సుకన్య, ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరి పైరులో మానిపండు తెగులు నివారించాలి

ఏవో బాలాజీ గంగాధర్



చెరుకుపల్లి: మరో రెండు రోజులు వాతావరణ పరిస్థితులను అనుసరించి వరి కోతలు కోసుకోవాలని మండల వ్యవసాయ అధికారి టి.బాలాజీ గంగాధర్ రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని కావూరు, ఆరుంబాక గ్రామాల్లోని వరి పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. వర్షాలు పడుతున్నందున రైతులు వరి కోతలు మరో రెండు రోజులు ఆపుకోవాలన్నారు. పొలాల్లో నీరు ఎక్కువగా ఉంటే కాలువలు తీసి బయటకు పంపాలన్నారు. అదే విధంగా లేత పైరు అయినట్లయితే మాని పండు తెగులు వచ్చే అవకాశం ఉందని దీని నివారణకు కార్బండిజం ఒక గ్రాము లేదా కాపర్ ఆక్సిక్లోరైడ్ 2.5 గ్రాములు లీటరు నీటికి కలిపి వెన్నులు పైకి వచ్చే దశలో ఒక సారి, వారం రోజుల తరువాత రెండో సారి పిచికారీ చేసుకొని నివారించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు రైతులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ పట్టణ కమిటీ సమావేశం

రేపల్లె రూరల్: వైఎస్సార్ సీపీ రేపల్లె పట్టణంలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలతో మంగళవారం సాయంత్రం 4 గంటలకు చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లిలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ క్యాంప్ కార్యాలయంలో సమావేశం జరుగనుంది. సమావేశానికి పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని డాక్టర్ గణేష్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

ప్రజా సమస్యల పరిష్కార విభాగం ఇన్‌చార్జ్‌గా సురేష్‌బాబు

భట్టిప్రోలు: ప్రజా సంకల్ప వేదిక పరిధిలో ప్రజా సమస్యల పరిష్కార విభాగం వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా భట్టిప్రోలుకు చెందిన బట్టు సురేష్‌బాబును నియమిస్తూ వేదిక రాష్ట్ర అధ్యక్షులు మదిరె రంగసాయిరెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నియోజకవర్గ పరిధిలో సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి కృషి చేసిన వేదిక సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

కార్మిక నాయకుడు అంకమ్మరావు మృతి

సంతాపం తెలిపిన సీపీఎం నాయకులు



తెనాలిఅర్బన్: ఏపీఎస్‌ఆర్‌టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపకులలో ఒకరైన తెనాలి నాజరుపేట వాసి పి.అంకమ్మరావు (95) సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీపీఎం నాయకులు అక్కడికి వెళ్లి పార్థవ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అంకమ్మరావు ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎన్.భవన్నారాయణ, కొల్లిపర బాబు ప్రసాద్, ములకా శివ సాంబిరెడ్డి, షేక్ హుస్సేన్‌వలి, పి.జోనేష్, విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగులు కె.శివ శంకర్, ఎస్.సుబ్రమణ్యం, డాక్టర్ సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మురుగుపోయే విధంగా చూడండి



తెనాలిఅర్బన్: 39వ వార్డు ఆది ఆంధ్ర మున్సిపల్ స్కూల్ వెనుక రోడ్డులో మురుగు కాల్వల్లో పారుదల లేకపోవటం వల్ల ఇబ్బందులు పడుతున్నామని, ఆ సమస్యను పరిష్కరించాలని ఆ ప్రాంత వాసి ప్రేమ కుమారి మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నకు వినతిపత్రం ఇచ్చారు. పరిష్కస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా

ధాన్యం కొనుగోళ్లు

- ప్రభుత్వ నిబంధనలతో రైతుల ఇబ్బందులు
- ప్రయివేటు వ్యాపారస్తులను ఆశ్రయిస్తున్న వైనం
- ఆరబెట్టేందుకు అనుకూలించని వాతావరణం



జంపని గ్రామంలోని ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రం

వేమూరు: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు తూతూ మంత్రంగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వం, ధాన్యం కొనుగోలుకు కొన్ని నిబంధనలు ఏర్పాటు చేయడంతో రైతులు ప్రయివేటు వ్యాపారస్తులను, మిల్లర్లను ఆశ్రయిస్తున్నారు. తేమ శాతం 17 ఉంటే ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. తేమ శాతం 17 దాటితే అదనంగా 75 కిలోల బస్తాకు కిలో ధాన్యం తీసుకుంటున్నారు. ధాన్యం తేమ శాతం ఎంత పెరిగితే అన్ని కిలోల ధాన్యం అదనంగా తీసుకుంటున్నారు. అందువల్ల రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో ధాన్యం అమ్మడానికి భయపడుతున్నారు. వేమూరు నియోజకవర్గంలోని వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చుండూరు మండలాలు ఉన్నాయి. ప్రతి మండలంలో కొన్ని గ్రామాలను క్లస్టర్లుగా చేసి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. వేమూరు నియోజకవర్గంలో 34 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో మొత్తం 95,000 ఎకరాలలో వరి సాగవగా దాదాపు 28,500 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా.

- వేమూరు మండలంలో వేమూరు, జంపని, చావలి మూడు క్లస్టర్లుగా విభజించి వేమూరు, జంపని, చావలి, కుచ్చెళ్లపాడు, పెరవలి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కొనుగోలు కేంద్రాల్లో 2,800 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు.
- కొల్లూరు మండలంలో మూడు క్లస్టర్లు, 7 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 5,440 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు.
- భట్టిప్రోలు మండలంలోని ఒలేరు, సూరేపల్లి, పల్లికోన, ఐలవరం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో 47 క్వింటాళ్లు కొనుగోలు చేశారు.
- అమర్తలూరు మండలంలోని రెండు క్లస్టరు 6 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు అమర్తలూరు, మోపర్రు, గోవాడ, ఇంటూరు గ్రామల్లోని కొనుగోలు కేంద్రాల్లో 1,500 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు.
- చుండూరు మండలంలో 12 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. చినపరిమి, మోదుకూరు, వలివేరు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు జరుగుతుంది. మిగిలిన గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కాలేదు. చుండూరు మండలంలో ఇప్పటి వరకు 600 క్వింటాళ్లు కొనుగోలు చేశారు. వర్షాలు వల్ల రైతులు ధాన్యం రోడ్లపై ఎండ పెట్టు కుంటున్నారు. ఎండలు సక్రమంగా లేక పోవడంతో తేమ శాతం తగ్గడం లేదని రైతులు తెలిపారు. ప్రభుత్వం తేమ శాతంతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

తేమ శాతం తగ్గడం లేదు



ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతంతో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలి. వాతావరణ పరిస్థితులు సక్రమంగా లేక పోవడంతో తేమ శాతం తగ్గడం లేదు. పౌరసరఫరాల శాఖ అధికారులు తేమ శాతం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి.

– లంక శ్రీనివాసరరావు, పెరవలి పాలెం

ధాన్యం కొనుగోలులోనూ పక్షపాతం



రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను గిట్టుబాటు ధర కోసం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకొని వెళితే కొనుగోలు చేయడం లేదు. ధాన్యం కొనుగోలులో కూడా పార్టీ పక్షపాతం చూపిస్తున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయాలి.

– తాడికొండ వెంకటేశ్వరావు, కాకర్లమూడి

సమస్యల పరిష్కార వేదికకు 10 అర్జీలు

రేపల్లె రూరల్: సమస్యల పరిష్కారానికై నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఎం.ప్రసాద్ చెప్పారు. పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. చెరుకుపల్లి మండలం రాంబొట్లవారిపాలెంలో నిర్మిస్తున్న రైస్ మిల్లుతో కాలుష్యం ఏర్పడే ప్రమాదం ఉందని, నిర్మాణం నిలుపుదల చేయాలని దామెర్ల రాజారావు, అల్లపర్తి రమణారావులు వేర్వేరుగా రెండు దరఖాస్తులు చేశారన్నారు.

రేపల్లె ఆర్టీసీలో డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్న టి.వసంతబాబు డిపోలోని అధికారులు తనను వేధిస్తున్నట్లు ఫిర్యాదు చేశాడన్నారు. బేతపూడి గ్రామానికి చెందిన పరుచూరి సాయిప్రసాద్ తనపై చర్చి పాస్టర్ దాసుబాబు దౌర్జన్యం చేస్తున్నాడని ఫిర్యాదు చేశాడన్నారు. నడక మార్గానికి విద్యుత్ స్తంభం అడ్డుగా ఉందని మార్చాలని రేపల్లె పట్టణం 13వ వార్డు నుంచి అర్జీ అందగా, రేపల్లె మున్సిపాలిటీలో అకాల వర్షాలతో విద్యుత్ స్తంభాలు, తీగలు మరమ్మతుకు గురయ్యాయని సరి చేయాలని అర్జీ అందిందన్నారు. విద్యుత్ మీటర్ ఫీజ్ రీస్టోర్ చేయాలని 1, ఆక్రమణల సమస్యపై 1, డ్రైనేజీ సమస్యపై 1, పొలం ఆన్‌లైన్ చేయాలని 1 అర్జీలు అందాయన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



విద్యార్థుల నుంచి గౌరవవందనం స్వీకరిస్తున్న కలెక్టర్ జె.వెంకట మురళి, జేసీ ప్రఖర్‌జైన్

బాపట్ల: విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. స్థానిక బాపట్ల ఉన్నత పాఠశాలలో స్టూడెంట్స్ అసెంబ్లీకి కలెక్టర్ సోమవారం హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జాతీయ జెండాను జిల్లా కలెక్టర్ ఎగురవేసి విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. తదుపరి విద్యార్థులతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు కష్టపడి చదివి, క్రమశిక్షణతో మెలిగినప్పుడే ఉన్నత స్థాయికి చేరుకోగలరని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించే సమావేశం డిసెంబర్ 7వ తేదీన బాపట్ల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరవుతున్నారని చెప్పారు. పాఠశాలకు అరుదైన గౌరవం దక్కిందన్నారు. విద్యార్థులంతా బాగా చదువుకోవాలి, ఆడాలి, సంతోషంగా ఉండాలంటూ స్ఫూర్తిని నింపారు. తల్లిదండ్రులు ముగ్గుల పోటీలు, టగ్ ఆఫ్ వార్ పోటీలలో పాల్గొనే బాధ్యత విద్యార్థులదేనన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, ఆర్డీవోలు, జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పొలాల గట్లపై ఉత్పత్తులతో అదనపు ఆదాయం

బాపట్ల డీపీఎం వి.వాణిశ్రీ



ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి ఆర్డీస్ కిట్లను అందచేస్తున్న బాపట్ల డీపీఎం వాణిశ్రీ

భట్టిప్రోలు: రైతులు తమ పంట పొలాల గట్లపై కూరగాయలు, ఆకు కూరల విత్తనాలు వేసుకొన్న యెడల అదనపు ఆదాయం లభించడమే కాక, ఇంట్లో అవసరాలు తీరతాయని ప్రకృతి వ్యవసాయం బాపట్ల డీపీఎం వి.వాణిశ్రీ పేర్కొన్నారు. భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రకృతి వ్యసాయానికి సంబంధించి ఏపీ సీఎన్ఎఫ్ మాస్టర్ ట్రైనర్ నీలం ప్రకాష్ కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎం వాణిశ్రీ మాట్లాడుతూ రైతులు సాధ్యమైన మేర పొలం గట్లను వెడల్పుగా ఉండేలా చూసుకోవాలని కోరారు. ప్రకృతి వ్యసాయం ద్వారా సాగు చేసిన కూరగాయలు, ఆకుకూరలు ఆరోగ్యానికి మంచివని తెలిపారు. ఇందు కోసం ప్రతి సోమవారం మండల కేంద్రమైన భట్టిప్రోలులో ప్రకృతి వ్యసాయం ద్వారా పండించిన ఉత్పత్తులను విక్రయిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో వెల్లటూరు, సూరేపల్లి, ఐలవరం యూనిట్ల పరిధిలోని ఐసీ ఆర్పీలు ఎల్-2, ఎల్-1 కేడర్లకు ఆర్డీఎస్ కిట్స్ పంపిణీ చేశారు. సమావేశంలో ఎంపీడీవో ఎస్.వెంకట రమణ, ఏవో జి.మీరయ్య, మండల సమాఖ్య ఏపీఎం జి.శ్రీమన్నారాయణ, ఈవోపీఆర్డీ టి.ఊహారాణి, ఎన్ఆర్‌జీఈఎస్ ఏపీవో శివపార్వతి, ఏపీ సీఎన్ఎఫ్ సీఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

అమర్తలూరు(వేమూరు): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో మారుతి శేషాంబ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ రావర్ల నరేంద్ర అధ్యక్షతన నిర్వహించడం జరుగుతుందని, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఆమె తెలియజేశారు.

ముగిసిన కార్తిక మాసం

- పోలిని స్వర్గానికి వదిలిన మహిళలు
- దీప కాంతులతో మెరిసిన కాలువలు, దేవాలయాలు





ముత్తాయపాలెంలోని పంట కాలువ వద్ద పూజలు చేస్తున్న మహిళలు

0బాపట్లటౌన్: గత నెల రోజులుగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేసిన మహిళలు కార్తిక మాసం ముగింపు సందర్భంగా సోమవారం తెల్లవారుజామున సూర్యలంక సమీపంలోని పేరలి డ్రైన్, ముత్తాయపాలెం చానల్, సూర్యలంక తీరం ఒడ్డున ప్రత్యేక పూజలు నిర్వహించారు. సముద్ర అలల తాకిడికి దీపాలు వెలగకపోవడంతో వేకువ జామున సముద్రంలో స్నానాలు చేసి సముద్రజలాలు కలిసే ప్రాంతంలో పేరలి డ్రైన్ ఒడ్డున మహిళలు జ్యోతులు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. పోలి పాడ్యమి పురస్కరించుకొని అరటి దొప్పల్లో దీపాలు వెలిగించి వాటిని కాలువల్లో వదిలారు. కార్తిక మాసం ముగింపులో భాగంగా పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో మహిళలు సామూహిక కుంకుమార్చన, గౌరీదేవి వ్రతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, మహిళలు పాల్గొన్నారు.

భట్టిప్రోలు: కార్తిక మాసం ముగింపు పురస్కరించుకుని సోమవారం భక్తులు పోలిని నీటిలో వదిలి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామునే పుణ్య స్నానాలు ఆచరించి దైవ దర్శనం చేసుకున్నారు. అరటి దొప్పలపై ఆవు నెయ్యితో గుబ్బ వత్తులు చేసి వాటిని వెలిగించి కాల్వల్లో వదిలారు. కార్తిక మాసం నెల రోజులు శివాలయాలు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు శివానుగ్రహం పొందారు. కార్తిక మాసంలో ఏ రోజు దీపాన్ని వెలిగించకపోయినా ఈ రోజు 30 వత్తులతో దీపం వెలిగించి నీటి ప్రవాహంలో వదిలితే ఆ మాసమంతా దీపారాధన చేసిన పుణ్యం వస్తుందని పురాణ కథనం.

చెరుకుపల్లి: పోలి పాడ్యమిని పురస్కరించుకొని సోమవారం తెల్లవారుజాము నుంచి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు నెల రోజులు కార్తిక మాసం ముగిసిన తరువాత మరుసటి రోజు జరుపుకునేదే పోలి పాడ్యమి. ఈ పోలి పాడ్యమిని పోలి స్వర్గానికి వెళ్లుట అని కూడా అంటారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు తరలివచ్చి స్వామి వారికి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని కావూరు, ఆరేపల్లి, చెరుకుపల్లి గుళ్ళపల్లి తదితర ఆలయాల్లో పూజలు నిర్వహించి కాల్వ గట్లపై అరటి దొప్పల్లో దీపాలు వెలిగించి జలాల్లో వదిలి భక్తిని చాటుకున్నారు. గుళ్ళపల్లి ఆనందీశ్వర స్వామి ఆలయం సమీపంలో కాల్వలు లేకపోవటంతో ఆలయ అర్చకుడు ప్రయాగరాం బాబు, ధర్మకర్త పొన్నపల్లి సత్యన్నారాయణ, కమిటీ సభ్యులు ఆలయం ముందే ప్రత్యేకంగా కోనేటిని ఏర్పాటు చేసి అందులో శివలింగాన్ని ప్రతిష్ఠించారు. ఇది చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది.



ఆనందీశ్వరస్వామి ఆలయం కోనేరులో దీపాలు



పేరలి డ్రైన్‌లో దీపాలను వదులుతున్న మహిళలు

పారిశుద్ధ్య పనులు పర్యవేక్షణ

రేపల్లెరూరల్: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రజల సహకారం అవసరమని మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో సోమవారం ఆయన పర్యటించి పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. గృహాల నుంచి వచ్చే వ్యర్థాలను రహదారులపై పడవేయకుండా పారిశుద్ధ్య కార్మికులకు అందించాలన్నారు. పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగు పరిచేందుకు ప్రతి వార్డులో సిబ్బందిని నియమించి నిత్యం వారి పనితీరు పర్యవేక్షిస్తున్నామన్నారు. వార్డుల్లో పారిశుద్ధ్య సమస్య తలెత్తితే తమకు సమాచారం అందించాలని కోరారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు తదితరులున్నారు.

భట్టిప్రోలులో సామూహిక కుంకుమార్చనలు



భట్టిప్రోలు: భట్టిప్రోలు రథం సెంటర్‌లో కొలువైన రుక్మిణి సత్యభామ సమేత వేణు గోపాలస్వామి ఆలయంలో కొలువైన రాజ్యలక్ష్మి అమ్మవారి సన్నిధిలో 66వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. కుంకుమార్చనలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మార్గశిర మాస పాడ్యమి 1958లో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. నాటి నుంచి క్రమం తప్పకుండా ఈ కార్యక్రమాన్ని జరుపుతున్నారు. విగ్రహాన్ని దివంగత మానేపల్లి లింగయ్య సమర్పించారు. టీటీడీ మండల ధర్మాచారి బూర్లె అరుణ కుమారి సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. రాజ్యలక్ష్మి భజన మండలి ఆధ్వర్యంలో ఆర్గనైజర్స్ ఎం.ఉమామహేశ్వరి, కె.యశోదాదేవిలు అమ్మవారి పుట్టిన రోజు సందర్భంగా దివంగత ఎం.నరసింహారావు జ్ఞాపకార్థం ధర్మపత్ని లక్ష్మీసరోజిని రూ.1,00,116 విరాళం అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్ శారద, కె.హేమలత, డి.శశి, ఎం.ధనలక్ష్మి, ఎం.మహి తదితరులు పాల్గొన్నారు..

నరేంద్రస్వామికి చందన అలంకారం



పెదపులివర్రు(భట్టిప్రోలు): మార్గశిర మాస పురస్కరించుకుని సోమవారం వ్యాఘ్రపురి క్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన భట్టిప్రోలు మండలం పెదపులివర్రులో స్వయంభువుగా వెలసిన రాజరాజ నరేంద్రస్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారు దివ్య చందన అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం రాత్రి కార్తిక బహుళ అమావాస్య సందర్భంగా స్వామి వారి ఆలయంలో మహా గణపతి సాక్షిగా కోటి దీపోత్సవం అశేష భక్త జన సందోహం మధ్య కనుల పండువగా జరిగింది. ఒక్కో ప్రమిదలో లక్ష ఒత్తుల చొప్పున వంద ప్రమిదలలో కోటి దీపాలను వెలిగించారు.

పంట చేతికి వచ్చే తరుణంలో వర్షం పాలు



వర్షపు నీటిలో తేలుతున్న వరి పంట

భట్టిప్రోలు: తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో రైతులు కుదేలయ్యారు. సోమవారం ఒకింత వాతరణం తెరిపించింది. పంట చేతికి వచ్చే తరుణంలో వర్షం ధాటికి పంటలు నీటి పాలయ్యాయి. హార్వెస్ట్ చేసిన ధాన్యాన్ని రహదారులపై ఓ పక్కన ఆరబోసి పట్టాలు కప్పుతున్నారు. వర్షాలు కురుస్తున్నప్పటికీ రైతులు పంట దిగుబడులు కాపాడుకునే ప్రయత్నం చేశారు. ఈ వర్షాలకు పైర్లు దెబ్బతిన్నాయి. కోత కోయని పంటలు నేల కొరిగిపోవడంతో ఒడ్లు పాడవుతాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. వరి కోసిన ఓదెలు నీటిలో మగ్గుతున్నాయి. నీట వాలిన పంటను చూస్తూ రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. పంటను కాపాడుకునేందుకు రైతులు పడుతున్న కష్టం వర్ణనాతీతం. పంట పొలాల్లో నీటిని తొలగించేందుకు రైతులు సన్నాహాలు చేస్తున్నారు. కౌలు రైతులకు కలిగిన నష్టాన్ని తలచుకుని ఆవేదన చెందుతున్నారు. వరిలో నీరు నిల్వ ఉండకుండా రైతులు సత్వరమే బయటకు వెళ్లేలా చూడాలని ఏవో జి.మీరయ్య సూచించారు. పడిపోయిన వరి పైరును 4, 5 దుబ్బులను కలిపి కట్టాలని, నీటిలో మునిగిన వరి పన్నలపై కల్లు ఉప్పు చల్లుకోవాలని చెప్పారు.

అంధకారంలో వరహాపురం



వరహాపురం(వేమూరు): వరహాపురం గ్రామంలో వీధి దీపాలు వెలగక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. వేమూరు మండలం వరహాపురం గ్రామంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామంలో వీధి దీపాలు వెలగక రాత్రి సమయంలో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. విష జంతువుల వల్ల ఎక్కడ ప్రమాదం వాటిల్లుతుందోనని ఆందోళన చెందుతున్నారు. గ్రామ సర్పంచ్‌కు, పంచాయతీ కార్యదర్శికి చెప్పినా ఫలితం దక్కడం లేదని, గ్రామంలో కటిక చీకటిలో నడుస్తున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, అధికారులు చొరవ తీసుకొని గ్రామంలో వీధి దీపాలు వెలిగేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. పంచాయతీ విస్తరణాధికారి చొప్పర శేఖర్‌ను వివరణ కోరగా గ్రామస్తులు సమస్యను ఆయన దృష్టికి తీసుకురాలేదని, పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి వీధి దీపాలు వెలిగేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. సమస్యలు ఆయన దృష్టికి తీసుకురావాలని కోరారు.